క్లుప్తంగా

నేడు వైఎస్సార్‌ జయంతి వేడుకలు

ప్రొద్దుటూరు : దివంగత ముఖ్యమంత్రి డాక్టర్‌ వైఎస్‌ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్లు మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ భీమునిపల్లి లక్ష్మీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మైదుకూరు రోడ్డులోని వైఎస్‌ రాజశేఖరరెడ్డి విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పూలమాల వేసి నివాళి అర్పిస్తారని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని, జయప్రదం చేయాలని కోరారు.

లైబ్రరీని సద్వినియోగం చేసుకోండి

పోరుమామిళ్ల : విద్యార్థులు సెలవు రోజుల్లో గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్‌ ఆఫ్రిది, రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదాపీర్‌ కోరారు. ఆదివారం వారు మాట్లాడుతూ పాఠశాల సెలవు దినాల్లో విద్యార్థులు తప్పకుండా గ్రంథాలయానికి వచ్చి జనరల్‌ నాలెడ్జి, కథల పుస్తకాలు, చరిత్ర పుస్తకాలు, దినపత్రికలు చదవాలన్నారు. విద్యార్థుల కొరకు వివిధ రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు.లైబ్రరీకి రావడం వల్ల విజ్ఞానం పెంపొందిచుకోగలరన్నారు.

గురువును దైవంగా భావించిన భారతీయ సంస్కృతి



ఉపాధ్యాయుడు శ్రీనివాసులుకు జ్ఞాపిక అందజేస్తున్న హనుమంతరావు

బద్వేలు అర్బన్‌ : విద్యను బోధించే గురువును భారతీయ సంస్కృతి దైవంగా భావించిందని ప్రముఖ సాహితీవేత్త, భారత రాష్ట్రపతి అవార్డు గ్రహీత విద్వాన్‌ డాక్టర్‌ గానుగపెంట హనుమంతరావు పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్‌ బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన మారెళ్ళ శ్రీనివాసులు అభినందన సభ ఆదివారం స్థానిక ఎస్‌ఆర్‌ఎస్‌బీ ఫంక్షన్‌ హాలులో నిర్వహించారు. అనంతరం శ్రీనివాసులును ఘనంగా సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి డాక్టర్‌ చెన్నయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.వి.సుబ్బారెడ్డి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.


ఎర్రచందనంపై తనిఖీలు ముమ్మరం



అడవిలో రస్తా పరిశీలిస్తున్న రేంజర్‌

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల రేంజిలో ఎర్రచందనం అక్రమ రవాణాపై తనిఖీలు ముమ్మరం చేసినట్లు రేంజర్‌ రఘునాథరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ అటవీశాఖ మంత్రి ఎర్రచందనంపై సీరియస్‌గా దృష్టి సారించడంతో డీఎఫ్‌ఓ సందీప్‌రెడ్డి ఆధ్వర్యంలో బృందాలు ఏర్పడి రాత్రిళ్లు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధికారులు టీమ్‌గా ఏర్పడి వాహనాలు తనిఖీ చేయడం, పాతముద్దాయిల కదిలికలు, బెయిల్‌పై ఉన్న నేరస్తుల కదలికలపై దృష్టి పెట్టినట్లు వివరించారు. పాతముద్దాయిలు మళ్లీ నేరాలకు పాల్పడితే కేసు నమోదు చేసి పీడీ యాక్ట్‌ పెట్టాలని ఉన్నతాధికారులు ఆదేశించారన్నారు.

పరామర్శ



గంగరాజు మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్‌ సుధ

అట్లూరు : తంబళ్ళగొంది గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గంగరాజు మృతదేహానికి ఆదివారం బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్‌ సుధ ఘనంగా నివాళులర్పించారు. మాజీ మండలాధ్యక్షురాలు పెరుగుసావిత్రి, వైఎస్సార్‌సీపీ నాయకుడు పెరుగు గంగయ్య సోదరుడైన గంగరాజు (38) శనివారం పొలాలకు వెళ్ళి ఉన్నపలంగా మృతిచెందడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతుని కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉండటంతో పాటు ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీఏ చైర్మన్‌ రొండా మాధవరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి అందూరు రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అమ్మవారికి విశేష పూజలు

చింతకొమ్మదిన్నె : మండలంలోని బొగ్గలేటిపల్లి కొత్తపేట సమీపంలోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కార్యనిర్వహణ అధికారి పి.సురేష్‌ కుమార్‌రెడ్డి అన్న ఏర్పాట్లను చేశారు.

కల్యాణ వైభోగమే..



కార్యక్రమాన్ని తిలకిస్తున్న భక్తులు



కల్యాణోత్సవంలో శ్రీదేవి, భూదేవి సమేత రతనాల వేంకటేశ్వరుడు



ప్రత్యేక అలంకరణలో రతనాల వేంకటేశ్వరుని మూలవిరాట్‌

ప్రొద్దుటూరు కల్చరల్‌ : స్థానిక పాతమార్కెట్‌లోని శ్రీ రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శ్రీదేవి, భూదేవి సమేత రతనాల వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వేకువజామున వేంకటేశ్వరస్వామి, స్వామివారి చెల్లెలు లలితాదేవి మూలవిరాట్‌లకు విశేష అభిషేకాలు చేసి నూతన పట్టువస్త్రాలు, వెండి కవచాలు, రంగురంగుల పూలతో అలంకరించారు. లోకకల్యాణార్థం గణపతి పూజ, విష్వక్సేనపూజ, గణపతి, నవగ్రహ, వేంకటేశ్వర హోమాలను వేదపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూర్ణాహుతిగా పూజా, హోమద్రవ్యాలను సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత రతనాల వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి సుముహూర్తంలో భక్తజనులు ఆసక్తిగా తిలకిస్తుండగా వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య కల్యాణోత్సవాన్ని వైభవోపేతంగా జరిపారు. వేదపండితులు వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని తిలకించడం వల్ల కలగే శుభాలను, స్వామివారి మహిమలను భక్తులకు వివరించారు. ఆలయాన్ని పునఃనిర్మించి అభివృద్ధి చేసిన సందర్భంగా స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహించినట్లు ఆలయ ట్రస్ట్‌ కమిటీ ప్రతినిధులు తెలిపారు. కల్యాణోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించి కాయాకర్పూరాలను నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమానంతరం భక్తులకు అన్న ప్రసాద వినియోగం జరిగింది.

12న మండల సర్వసభ్య సమావేశం

చాపాడు : స్థానిక మండల పరిషత్‌ కార్యాలయ సభా భవనంలో ఈ నెల 12న మండల సర్వసమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రహంతులయ్య తెలిపారు. ఉదయం 10.30 గంటలకు మండల అధ్యక్షుడి అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులతో పాటు అన్ని శాఖలకు చెందిన అధికార్లై ప్రజా సమస్యలపై చర్చించాలని ఎంపీడీఓ కోరారు.

సుబ్బరాయుడు సేవలు అభినందనీయం

ఖాజీపేట : ఉపాధ్యాయుడిగా సుబ్బరాయుడు చేసిన సేవలు అభినందనీయం అని రిటైర్డ్‌ ఎంఈఓ ఉమామహేశ్వర్‌రెడ్డి అన్నారు. ఖాజీపేటలోని జీవీఆర్‌ కళ్యాణ మండపంలో ఉపాధ్యాయుడు సుబ్బారాయుడుకి ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఆయన తోపాటు పని చేసిన బంధువులు ఉపాధ్యాయులు మిత్రులు పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో మండలంలోని ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌ చాంపియన్‌కు సన్మానం



రామకృష్ణను సత్కరిస్తున్న ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, డాక్టర్‌ వరుణ్‌కుమార్‌రెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్‌ : స్థానిక ఉపాధ్యాయ సేవా కేంద్రంలో ఆదివారం అంతర్జాతీయ అథ్లెటిక్స్‌ పోటీల్లో ప్రతిభ కనపరచి బంగారు పతకాన్ని సాధించిన మేడా రామకృష్ణను సత్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ రామకృష్ణ అంతర్జాతీయ మాస్టర్స్‌ అథ్లెటిక్స్‌ చాంపియన్‌ షిప్‌ 200 మీటర్ల పరుగుపోటీలో బంగారు పతకం సాధించడం గర్వకారణమన్నారు. ఉత్తరప్రదేశ్‌ అయోధ్యలోని డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ ఇంటర్నేషనల్‌ స్టేడియంలో ఈ నెల 5న నిర్వహించిన ఈ పోటీల్లో ఆరు దేశాల నుంచి 18 మంది క్రీడాకారులు పాల్గొనగా రామకృష్ణ బంగారు పతకం సాధించారని, ఆయన మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విజయవాడ అసిస్టెంట్‌ స్పోర్ట్స్‌ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న రామకృష్ణను ఒంటేరుతోపాటు డాక్టర్‌ వరుణ్‌కుమార్‌రెడ్డి శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో వ్యాయామ శిక్షణా కళాశాల అధ్యాపకులు పంజగల మధుసూదన్‌బాబు, డాక్టర్‌ శ్రీనివాసులరెడ్డి, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత విజయమోహన్‌రెడ్డి, పద్మవీరన్న, సురేష్‌, జయరాం, కెరోజి పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్‌ ఆవిర్భావ దినోత్సవం



సంజీవనగర్‌లో ఎమ్మార్పీఎస్‌ పతాకావిష్కరణలో నాయకులు



మూలవారిపల్లెలో మాదిగ అమరవీరులకు నివాళి అర్పిస్తున్న నాయకులు

ప్రొద్దుటూరు : స్థానిక సంజీవనగర్‌లో ఆదివారం ఎమ్మార్పీఎస్‌ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎంఎస్‌పీ నియోజకవర్గ ఇన్‌చార్జి యాడికి రమేష్‌ మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్‌ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఎఫ్‌ జిల్లా అధ్యక్షుడు పిచుక బాబు, ఎమ్మార్పీఎస్‌ జిల్లా అధ్యక్షుడు మానికింది వెంకటేష్‌ మాదిగ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్‌ 30 ఏళ్లుగా మాదిగ జాతి ఆకాంక్ష అయిన ఎస్సీ వర్గీకరణ కోసం మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో అనేక పోరాటాలు చేసిందన్నారు. ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో మాదిగ అమర వీరులకు జోహార్లు అర్పించారు. మందకృష్ణ మాదిగ 59వ పుట్టిన రోజు సందర్భంగా కేక్‌ కట్‌ చేసి అందరికీ పంచారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకుడు చిన్నయ్యమాదిగ, నరసింహులు మాదిగ, ఎంఈఎఫ్‌ నాయకుడు ఓబయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్‌ నియోజకవర్గ అధ్యక్షుడు ఆర్‌.బాలయ్య మాదిగ, మండల అధ్యక్షుడు నాగరాజు మాదిగ, దస్తగిరి మాదిగ, వెంకటేష్‌ మాదిగ, యాడికి తరుణ్‌, ఓబులేసు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

మండల పరిధి మూలవారిపల్లె గ్రామంలోని రాముల దేవాలయంలో ఎమ్మార్పీఎస్‌ అమరవీరుల దినోత్సవం నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో అమరులైన మాదిగలకు ఏపీఎమ్మార్పీఎస్‌ నాయకులు నివాళి అర్పించారు. డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర కన్వీనర్‌ నాగభూషణం, ఏపీ ఎమ్మార్పీఎస్‌ రాష్ట్ర నాయకుడు బాలలక్షుమయ్య మాదిగ, మండల అధ్యక్షుడు నంగనూరుపల్లె మనోహర్‌, ఉపాధ్యక్షుడు చాపాటి బాలనరసింహులు తదితరులు పాల్గొన్నారు.

శ్వేతపత్రం విడుదల చేయాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

ప్రొద్దుటూరు : ఉద్యోగ ఉపాధ్యాయ, పెన్షనర్ల ఆర్థిక బకాయిలపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక ఎస్‌టీయూ ప్రాంతీయ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు రావాల్సిన పీఆర్‌సీ బకాయిలు, డీఏ బకాయిలు, పీఎఫ్‌, ఏపీజీఎల్‌ఐ బకాయిలపై శ్వేతపత్రం విడుదల చేయలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు వీలైనంత త్వరగా ఐఆర్‌ను ప్రకటించాలని, పీఆర్సీ కమిటీని ప్రకటించాలని పేర్కొన్నారు. విద్యా వ్యవస్థను చిన్నాభిన్నం చేసిన జీఓ 117ను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో ఎస్‌టీయూ రీజనల్‌ కన్వీనర్‌ డి.సలీమ్‌, పి.రషీద్‌ఖాన్‌, పి.రమణారెడ్డి, ఎస్‌ఎండీ ఇలియాస్‌ బాషా, వై.సుబ్రహ్మణ్యం, సంజీవరెడ్డి, ఓబుళరెడ్డి, కొత్తపల్లె శీను, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

‘భూసేకరణలో రెవెన్యూ అధికారులు చేతివాటం’

పోరుమామిళ్ల : జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు అందించే నష్టపరిహారంలో రెవెన్యూ కార్యాలయంలో పనిచేస్తున్న కొందరు అధికారులు దళారుల అవతారమెత్తి కమీషన్‌కు కక్కుర్తి పడుతున్నారని సీపీఐ ఏరియా కార్యదర్శి పిడుగు మస్తాన్‌, పట్టణ సహాయ కార్యదర్శి కేశవ ఆరోపించారు. ఆదివారం వారు మాట్లాడుతూ బెంగుళూరు నుండి విజయవాడకు నిర్మిస్తున్న జాతీయ రహదారి మండలంలోని చెన్నారెడ్డిపేట, బొప్పాపురం, పేరమ్మగారిపల్లె, సిద్దవరం, టేకూరుపేట గ్రామాల మీదుగా వెళుతుందన్నారు. ఈ రహదారి కొరకు 2002లో భూసేకరణ జరిగిందని, భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించేందుకు అప్పటి రాజంపేట ఆర్డీఓ కేతన్‌గార్గ్‌ విచారణ చేసి ప్రభుత్వానికి నివేదిక పంపించారన్నారు. భూములు కోల్పోయిన రైతుల్లో అధికంగా దళితులు ఉన్నారని సీపీఐ నేతలు తెలిపారు. అయితే కార్యాలయంలో పనిచేస్తున్న డీటీ, సర్వేయర్‌లు ఒకే సర్వేనెంబర్‌ రెండుగా విభజించి, ఒకదానికే లబ్ధిదారుకు నష్టపరిహారం అందేలా చూస్తున్నారన్నారు. రెండో దాన్ని ధనవంతులు, రాజకీయ పలుకుబడి ఉన్నవారి పేరు చేర్చి, 20, 30 శాతం కమీషన్‌ కొట్టేస్తున్నారన్నారు. భూములు కోల్పోయిన పేద రైతులకు నష్టపరిహారం అందించడంలో ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. తహసీల్దారు కార్యాలయంలో పెద్దవారికి పనులు జరుగుతున్నాయని, పేదలకు పనులు కావడం లేదన్నారు. ఇక్కడ జరుగుతున్న ఈ వ్యవహారాలపై ఉన్నతాధికారులు విచారణ జరిపి అక్రమార్కులపై చర్య తీసుకోవాలని మస్తాన్‌, కేశవలు కోరారు. జరుగుతున్న అక్రమాలపై బద్వేలు ఆర్డీఓ, జిల్లా కలెక్టర్‌, సంబంధిత మంత్రులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

మానవత సేవలు ప్రశంసనీయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి



ప్రమాణ స్వీకారం చేస్తున్న మానవత కార్యవర్గం

ప్రొద్దుటూరు కల్చరల్‌ : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. స్థానిక వెంకటేశ్వర్ల పేటలోని సరస్వతి విద్యామందిరంలో ఆదివారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని, చేతనైన సహాయం ఆపదలో ఉన్న వారికి అందించాలన్నారు. ఈ సందర్భంగా పలువురికి ఆర్థిక సహాయంతోపాటు కుట్టుమిషన్‌ అందించారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలిగా ఇండ్ల భాగ్యలక్ష్మి, కార్యదర్శిగా మాలెపాటి సుబ్రహ్మణ్యం, కోశాధికారిగా నిర్మలాదేవి, ఉపాధ్యక్షుడిగా రమేష్‌, సంయుక్త కార్యదర్శిగా సత్యనారాయణ, ఈసీ ఎడ్యుకేషన్‌ సువర్ణ, ఈసీ ఎమర్జెన్సీ మునిశేఖర్‌రెడ్డి, ఈసీ హెల్త్‌ నరేంద్రారెడ్డి, ఈసీ అవేర్‌నెస్‌ ప్రసాద్‌రెడ్డి, గౌరవ డైరెక్టర్లుగా సన్నుతి శ్రీనివాసులు, మాకం సురేష్‌, డాక్టర్‌ ఎం.నాగలక్ష్మి తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపడుతామని వారు తెలిపారు.

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్‌ కళావతి, శివదర్శనానంద స్పిరిచువల్‌ ట్రస్టు వ్యవస్థాపకురాలు శివదర్శనానంద సరస్వతి మాతాజీ, చిట్టెం భాగ్యలక్ష్మి, వెంకటసుబ్బయ్య, కో చైర్మన్‌ రామచంద్రుడు, నరిసింహులు, శ్రీధర్‌, ఓబుళరెడ్డి, రమణారెడ్డి, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రోజురోజుకు మితిమీరిపోతున్న భూ ఆక్రమణలు

- ఖాళీ స్థలం కనబడితే చాలు గుడిసెలు వేయిస్తున్న వైనం
- ప్రేక్షకపాత్ర వహిస్తున్న రెవెన్యూ, పోలీసు అధికారులు



జగనన్న లేఅవుట్‌లో సీపీఐ ఆధ్వర్యంలో వేసిన గుడిసెలు

గోపవరం : మండలంలో రోజురోజుకు భూ ఆక్రమణలు మితిమీరిపోతున్నాయి. ఎక్కడ ప్రభుత్వ స్థలం కనిపించినా వామపక్ష పార్టీలు పేదలను రెచ్చగొట్టి గుడిసెలు వేయిస్తున్నారు. చర్యలు తీసుకోవాల్సిన రెవెన్యూ, పోలీసు అధికారులు చేతులెత్తేయడంతో వారి ఆగడాలకు అంతులేకుండా పోతుంది. పి.పి.కుంట జగనన్న లేఅవుట్‌లో గత ప్రభుత్వం అర్హులకు కేటాయించిన స్థలాలను కూడా కబ్జా చేసి గుడిసెలు వేశారు. బేతాయపల్లె పంచాయతీలో గోపవరం రెవెన్యూ పొలం 1557, 1622 సర్వే నెంబర్లలోని ప్రభుత్వ స్థలంలో వంద సంఖ్యలో పేదలు గుడిసెలు వేశారు. వీరిలో దాదాపు 70 శాతం పైగా స్థానికేతరులు ఉన్నారు. నెల్లూరు–ముంబై జాతీయ రహదారి పక్కనే ప్రభుత్వ స్థలాలు ఉండటం, అది కూడా సెంచరీ పానెల్స్‌ పరిశ్రమకు దగ్గర కావడంతో సెంటు స్థలం కనబడినా పోటాపోటీగా అక్రమ గుడిసెలు వేస్తున్నారు. ఆదిలోనే రెవెన్యూ అధికారులు ఆక్రమణదారులపై చర్యలు తీసుకుని ఉంటే ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చేది కాదని అధిక శాతం మంది ప్రజలు చర్చించుకుంటున్నారు. పి.పి.కుంట జగనన్న లేఅవుట్‌లో సుమారు 60 మందికి పైగా గత ప్రభుత్వం పట్టాలు మంజూరు చేయడం జరిగింది. ప్రస్తుతం ఈ లేఅవుట్‌లో కూడా సీపీఐ నాయకులు పేదలను రెచ్చగొట్టి లేఅవుట్‌కు కేటాయించిన స్థలంతో పాటు పక్కన ఉన్న ప్రభుత్వ భూమి, వంక పోరంబోకును కూడా ఆక్రమించి పేదల చేత గుడిసెలు వేయించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతి సచివాలయం పరిధిలో జగనన్న లేఅవుట్లను పేదల కోసం కేటాయించారు. ఇంత మంచి అవకాశం ఇచ్చినా ఇంకా వందల సంఖ్యలో గుడిసెలు వేస్తున్నారంటే నిజంగా వీరికి ఇళ్లు లేవా లేక సీపీఐ నాయకుల ఉచ్చులో ఇరుక్కున్నారా అనే సందేహాలు కూడా వస్తున్నాయి.

మా స్థలాలు చూపండి

జగనన్న లేఅవుట్‌లో గత ప్రభుత్వం ఇళ్ళ పట్టాలు మంజూరు చేసి మా పేరు మీద రిజిస్ట్రేషన్‌ కూడా చేయించడం జరిగింది. మాకు ఇచ్చిన స్థలాల్లో అక్రమంగా స్థానికేతరులు గుడిసెలు వేశారు. మా స్థలాలు మాకు చూపించాలని పట్టాలు పొందిన వారు స్థానిక రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. అయినా కూడా రెవెన్యూ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ విషయమై త్వరలోనే కార్యాలయం ఎదుట ధర్నా చేసేందుకు కూడా పట్టాలు పొందిన వారు సిద్ధమవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమంగా వేసిన గుడిసెలను తొలగించాల్సిన అవసరం ఉంది.

వైఎస్‌ జయంతిని ప్రపంచవ్యాప్తంగా జరుపుకోవాలి

పోరుమామిళ్ల : దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి 75వ పుట్టినరోజును ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలందరూ జరుపుకోవాలని సీనియర్‌ మహిళానేత, రాష్ట మహిళా ఆర్థికసంస్థ మాజీ చైర్‌ పర్సన్‌ కృష్ణమ్మ పిలుపునిచ్చారు.

వంద శాతం సబ్సిడీతో పండ్ల తోటల పెంపకం

గోపవరం : ఉపాధి హామీ పథకం ద్వారా వంద శాతం సబ్సిడీతో పండ్లతోటలు సాగు చేసుకునే అవకాశముందని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ తెలిపారు. ఆసక్తి కలిగిన రైతులు ఈనెల 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 5 ఎకరాలు అంతకంటే తక్కువ భూమి కలిగిన చిన్న, సన్నకారు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మామిడి, చీనీ, సన్ననిమ్మ, జామ, సపోట తదితర పండ్లతోటలు సాగు చేసుకునేందుకు వంద శాతం సబ్సిడీ ద్వారా ప్రభుత్వం రాయితీ కల్పించిందన్నారు. ఆసక్తి కలిగిన రైతులు మండల ఉపాధి హామీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరింత సమాచారం కోసం ఏపీఓను సంప్రదించాలని కోరారు.

నేడు పబ్లిక్‌ గ్రీవెన్స్‌డే

గోపవరం : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్‌ గ్రీవెన్స్‌డే) కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల ప్రత్యేకాధికారి నాగరాజ తెలిపారు. అన్నిశాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. మండల వ్యాప్తంగా ఎలాంటి సమస్యలు ఉన్నా అర్జీలు ఇచ్చి పరిష్కరించుకోగలరని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

విభజన హామీల అమలు కోసం పోరాటం

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌ : ఉమ్మడి రాష్ట్ర విభజన హామీల అమలు కోసం దశల వారి పోరాటానికి సమాయత్తమవుతున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి జి.చంద్ర పేర్కొన్నారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 1 నుంచి 3వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగిన సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాల్లో దేశం, రాష్ట్రంలో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాలపై చర్చించడం జరిగిందన్నారు. రాష్ట్ర విభజన అనంతరం 2014 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు ప్రభుత్వం రాష్ట్ర రాజధాని అమరావతి శంకుస్థాపన కోసం వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ మట్టి, నీళ్ల ముఖాన గొట్టి రాష్ట్ర ప్రజలను నిలువునా మోసం చేశారన్నారు. తరువాత 10 ఏళ్ల ఎన్‌డీఏ పాలనలో బీజేపీకి సొంత బలం ఉండటం వల్ల తాము ఏమీ చేయలేకపోయామని టీడీపీ, వైఎస్‌ఆర్‌సీపీలు చెప్పాయన్నారు. ప్రస్తుతం కేంద్రంలో టీడీపీ మద్దతుతో మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం, రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఉన్నందు వల్ల విభజన హామీలు అమలు చేసేందుకు మార్గం సుగమం అయిందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాయలసీమ, ఉత్తరాంధ్రలకు ప్రత్యేక ప్యాకేజీ, జాతీయ హోదా కలిగిన పోలవరానికి నిధులు, ఆర్థిక లోటు భర్తీ, నదీ జలాల వివాదం, రాజధాని నిర్మాణం, కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, విశాఖ ఉక్కు పరిరక్షణతోపాటు అసెంబ్లీలో అమరావతి రాజధానిగా ప్రకటిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల వారీగా చంద్రబాబు ప్రకటించిన హామీల అమలుకు డబుల్‌ ఇంజిన్‌ సర్కారు శ్రీకారం చుట్టాలన్నారు.